# హైదరాబాద్ హౌస్ వైఫ్

## మిర్రర్

తెల్లని కాకులు లేవు అన్నాడు శతకకారుడు. కానీ హైదరాబాదులో నల్లని కాకులు కూడా కాన రావు.

కాకులు దూరని కారడవి కాదు గానీ, కారడవి కంటె ఘోరంగా వుండే బిజీ లొకాలిటీ అది.

తెల్లవారింది

అందుకు సూచనగా కాకులు కావు కావు మంటూ అరవలేదు. అయితే తెల్లవారినట్టు తెలియటం ఎలా అనే సందేహం కలగ నవసరం లేదు. భగవంతుడు ప్రతిదానికీ ఏదో ఏర్పాటుచేసి వుంచుతాడు

తెల్లవారగానే "కావుకావుమనే కాకిగోల"కి బదులు, "పాలు పాలు" అరుపులు వినపడు తుంటాయి

అలాంటి అరుపులకి మెలకువ వచ్చింది. స్వరాజ్యానికి.

"ఎవరండీ బయట కాకిలా అరుస్తున్నారు" అంటూ అదే దుప్పటిలో తనని కావలించుకుని పడుకున్న మొగుడు చెవిలో గుసగుస లాడింది స్వరాజ్యం

కాకి (పాల) గోలకి కాదు గానీ కలువభామ గుసగుసలకి మెలకువ వచ్చింది రాజుకి.

"అమ్మా! పాలవాడు వచ్చాడు" అంటూ కంగారుగా మంచం దిగి లుంగీ సరిచేసుకుంటూ గబగబా వంటగదిలోంచి స్టీలు గిన్నె తీసుకుని వీధి తలుపుతీసి, పాలు పోయించుకు వచ్చాడు

పాలగిన్నె టేబులుపైన వుంచి, మళ్ళీ వచ్చి దుప్పటికింద స్వరాజ్యం ప్రక్కన చోటు చేసుకున్నాడు

"ఎందుకండీ అలా కంగారు పడ్డారు" అంది స్వరాజ్యం.

రాజు సరిగ్గా మూడు నెలల కిందట స్వరాజ్యం మెడలో తాళికట్టి తాను స్వాతంత్ర్యం కోల్పోయాడు. అతనిముందు తలవంచి తాళికట్టించుకున్న మరుక్షణంనుంచీ, అతని హృదయ సామ్రాజ్యంలో రాజపీఠం అలంకరించింది స్వరాజ్యం.

మంచీ చెడూ, వర్జ్యం వారం, చీరెసారె అన్నీ చూసి నిన్ననే స్వరాజ్యాన్ని కాపురానికి పంపించారు.

రాజు చిక్కడపల్లిలో ఓ పోర్షను తీసుకుని తమ స్వీట్ హోమ్‌కి కావలసిన ఏర్పాట్లుచేసి వుంచాడు

గతరాత్రి తొమ్మిది గంటల సమయంలో ఇద్దరూ బస్సుడిపోలో దిగారు. ఇల్లు చేరేసరికి తొమ్మిదిన్నర. సామాను సర్దుకునేసరికి పది దాటింది.

ప్రయాణం అలసట, అంతకుముందు కూడా మూడు రోజులుగా అలసివున్న (?) ప్రాణాలకి వెంటనే నిద్ర పట్టింది.

దానా దీనా, స్వరాజ్యానికి హైదరాబాదులో కొత్త కాపురం మొదటిరోజు "పాలు పాలు" అనే కాకిగోలతో మొదలు అయింది.

"పాలవాడు పాలు పాలు అంటూ మూడు సార్లు మాత్రమే అరుస్తాడు. ఈ లోపల తలుపు తీసి మనం పాలు పోయించుకోకపోతే, అతను వెళ్ళిపోతాడు" అంటూ ఏకరువు పెట్టి హైదరాబాదులో సంసారయాత్రలో ఎదురు అయ్యే కష్ట సుఖాల లిస్టులోంచి ఓ బిట్ ఎక్స్‌ప్లెయిన్ చేసాడు.

"అయితే పాలవాడు వచ్చేసమయానికి రడీగా వుండి, ఇకనుంచి నేను పాలు పోయించుకుంటాను. రేపటినుంచి మీరు ఇలా కంగారుగా మంచం దిగి పరుగెత్తనవసరంలేదు" అంది స్వరాజ్యం.

ఆమె గొంతులో మీ కష్టాలే నా కష్టాలు అన్న ఓ దార్ఢ్య ధ్వనించింది. ఆమె తనను సుఖపెట్టటం కోసం తనజీవితంలో ప్రవేశించిందన్న అనుభూతి కలిగింది అతనికి.

కానీ తన సుఖం కోసం ఆమెను కష్టపెట్ట కూడదనుకున్నాడు రాజు.

పురాణ కాలంనుంచీ పురుషుడు తన స్వార్థం కోసం స్త్రీని బానిసగా చేసి వాడుకున్నాడు. భార్యని నడిబజారులో పెట్టి అమ్ముకున్న ఘనులు వున్నారు. జూదంలో పణంగా పెట్టి ఆడి, ఓడిన మహారాజులున్నారు. కానీ తను వారిలాంటివాడు కాదు.

స్త్రీని స్త్రీగా చూడదలుచుకున్నాడు. మనసున్న మనిషిగా, ప్రాణమున్న జీవిగా, ఆమెపట్ల తన హృదయంలో ఎంతో జాలి, దయ, గౌరవాభిమానా లున్నాయి.

అంతేకాక భార్యని సుఖపెట్టలేనివాడు, మానవత్వంలేని మనిషి అనీ, భార్యను తన స్వార్థంకోసం శారీరకంగా, మానసికంగా హింసించే మొగుళ్ళు మరు జన్మలో హీనమైన బ్రతుకు గడుపుతారనీ, ఇంకా ఏవేవో బోలెడన్ని నమ్మకాలు కలవాడు అతను.

వెంటనే ఓ చిన్న సైజు లెక్చరిచ్చి స్త్రీ జాతి పట్ల తనకున్న ఆదర్శభావాలను భార్యకి ఎరుక పరిచాడు.

అంతేకాక పాల విషయంలోనే కాదు మరి ఏ విషయంలోనూ ఆమె ఆందోళన చెందనవుసరం లేదనీ, మగవాడిగా కష్టపడటం తన బాధ్యత అనీ, సుఖపడటం నీవంతు అంటూ రాజు ఆమెపై గల తన ప్రేమను వ్యక్తం చేశాడు.

అయితే పెళ్ళాంమీద ఎవరికిమాత్రం ప్రేమ అభిమానాలుండవు? ఎవరుమాత్రం తమ భార్యని

**ఆమె ఇంతవరకూ ఎలాంటి సమాజంలో పెరిగిందో అర్థం చేసుకున్నాడు. ఆమెకు ఆధునిక ప్రపంచం గురించి తెలియచెప్పాలని నిశ్చయించుకున్నాడు. ఆమెను అజ్ఞానం నుంచి బయటకు తీసుకురావాలి....**

సుఖపెట్టాలనుకోరు? దేశంలో ఇంతమంది మొగుళ్ళుండగా వారందరిలో తానొక్కడే 'మేలు జాతి' మొగుడైనట్టుగా అతను మాట్లాడటం స్వరాజ్యానికి అర్థం కాలేదు.

అర్థంకాని విషయం గురించి బుర్ర పాడు చేసుకునే తత్వంకాదు ఆమెది. అందుకే చదువులో ఎనిమిదవ తరగతి దాటి ముందుకు వెళ్ళలేకపోయింది.

బి.కాం ఫస్టు క్లాసులో పాసయి, ఘనమైన బ్యాంకు ఉద్యోగం చేస్తున్న రాజుకి ఎనిమిదవ క్లాసువరకే ఎదిగిన స్వరాజ్యంపట్ల అంత అధిక ప్రేమ కలగటంలో ఏదైనా ప్రత్యేక కారణం వుందా అని అడిగితే—

ఏమో చెప్పలేము.

ఆమె కట్నంగా తెచ్చిన పదిహేనువేల నెట్ క్యాష్ కావచ్చు.

పుట్టింటివాళ్ళు ఆమెకు పసుపు కుంకుమగా యిచ్చిన అరెకరం కొబ్బరితోట కావచ్చు.

గుడిలో అమ్మవారి విగ్రహంకి వున్నట్లు, ఆమె మెడలోని బంగారపు నగలు కావచ్చు.

వీటిలో ఏదీ కాకపోతే—

నిండు కొలనులో అప్పుడే విచ్చుతున్న కమలంలాంటి ఆమె లేప్రాయపు అందం కావచ్చు.

ఏది ఏమైనా రాజు తన భార్యను చచ్చేట్టు ప్రేమిస్తున్నాడు. ఆమెను సుఖపెట్టటం తన ధ్యేయం. ఆమె ఆనందంకోసం తను ఎలాంటి సుఖాన్నయినా త్యాగం చెయ్యగలడు.

* * *

మరునాడు ఉదయం రాజు యధాప్రకారం కంగారుగా పాలగిన్నె తీసుకుని వీధి తలుపువైపుకి పరుగెత్తటం స్వరాజ్యానికి నచ్చలేదు.

"పెళ్ళికిముందు తప్పదుకాబట్టి అన్నీ మీరే చేసుకున్నారు. నేను వచ్చానుకదా! ఇలాంటి ఆడ పనులు ఇకనుంచీ నేను చేస్తాను" అంది ఆమె.

"అదిగో ఆ మాటే వద్దు. ఆడ-మగ అని విభజించటం నాకు నచ్చదు. గృహకృత్యాలు ఇద్దరూ కలిసి చేసుకోవాలి. అంతేకాక స్త్రీ స్వాతంత్ర్యం, పురుషులతో సమాన హక్కులు అంటూ స్త్రీ జాతిఅంతా పెద్ద విప్లవం లేవదీస్తుంటే నువ్వు ఇంకా 'ఆడపనులు' అంటూ ఎందుకు నీ చుట్టూ ఓ పరిధి ఏర్పరచుకుంటున్నావు" అన్నాడు రాజు

ఆమెకు స్త్రీ స్వాతంత్ర్యం, సమాన హక్కులు ఇలాంటి పదాలకు అర్థం తెలియదు. అలాంటి మాటలు ఆమె ఎప్పుడూ వినలేదు.

ఆమె కోనసీమలో ఓ మారుమూల గ్రామంలో పుట్టింది.

ఇంటిలో పదిమంది మనుషులు, బయట పది



పాడి పశువులు. ఎంత చేసినా తరగని పని. పని చేసిన శరీరానికి ఆకలి. ఆకలి కడుపుకి కమ్మటి తిండి. తిండి తిన్న శరీరానికి నిద్ర సుఖం ఇంట్లో తల్లిదండ్రుల ప్రేమ, అన్నదమ్ముల అనురాగం, మనసుకు తృప్తి.

వీటన్నిటిమధ్య కొలనులో కమలంలా ఎదిగిన స్వరాజ్యానికి రాజు మాటలు అర్థం కాలేదు.

తన మాటలు ఆమెకు అర్థం కానందుకు రాజు కోపగించుకోలేదు. విసుగు చెందలేదు.

ఆమె ఇంతవరకూ ఎలాంటి సమాజంలో పెరిగిందో అర్థం చేసుకున్నాడు. ఆమెకు ఆధునిక ప్రపంచం గురించి తెలియచెప్పాలని నిశ్చయించుకున్నాడు. నేటి ఆధునిక యుగంలో మానవుడు తన మేధస్సుతో విజ్ఞానంతో ఎంత ముందుకు సాగిపోయాడో ఆమెకు బోధపరచాలి. ఆమెచుట్టూ ఇంకా ఆ పల్లెటూరి స్తబ్దత, అమాయకత్వం, భయం, సంకోచం—ఎన్నో చేరి, ఆమెను అజ్ఞానం నుంచి బయటకు రానివ్వటంలేదు.

కాబట్టి తన తక్షణ కర్తవ్యం ఆమెను ఆధుని మహిళగా తీర్చిదిద్దటం.

* * *

మరునాడు రాజు ఆఫీసునుంచి వస్తూ ఓ పెద్ద ప్యాకెట్టు మోసుకువచ్చాడు.

"ఏమిటి ఇది?" అంటూ ఆత్రుతగా అడిగింది స్వరాజ్యం.

"కొత్తగా వచ్చిన శ్రీమతిగారికి ఓ చిన్న ప్రేమకానుక" అన్నాడు రాజు నవ్వుతూ.

"దేముడు మిమ్మలను నాకు కానుకగా ప్రసాదించాడు. ఇంకేం కావాలి?" అంది ఆమె మోహనంగా.

రాజు ఆమె ప్రేమకి కరిగిపోయాడు.

"నన్ను నీకు దేముడిచ్చాడు. కానీ నేను నీకు ఏమీ ఇవ్వలేదుకదా! అందుకని ఇది—దీన్ని మిక్చర్-కం-గ్రైండర్ అంటారు" అంటూ పాకెట్టు తెరిచి మిక్చరర్ బయటపెట్టాడు.

ఆ తరువాత అగ్ని పనిచేయు విధానం, దాని ఉపయోగం గురించి బ్రీఫ్‌గా క్లాసు తీసుకున్నాడు

అయితే ఆమెకు ఇది నచ్చలేదు. పెళ్ళికిముందు తను కుంచాలకికుంచాలు పప్పు రుబ్బి వడియాలు పెట్టేది. కుండెడు మజ్జిగచేసి వెన్న తీసేది అలాంటిది ఇద్దరు మనుషులకోసం, కాస్త పిండి రుబ్బుకుంటే ఏం? ఇంత డబ్బు దీనిమీద ఖర్చు పెట్టటం తనకి నచ్చలేదు.

అదే మాట ఆమె అంది.

అయితే—"ఈ ఆధునిక యుగంలో మానవుడు ఎన్నో పనులు యంత్రాలతో చేయించి, తాను సుఖపడుతున్నాడు. అలాంటి సౌకర్యం వదిలిపెట్టి ఇంకా శారీరకంగా కష్టపడటం అనాగరికం, అర్ధరహితం" అని వాదించాడు.

* * *

ఆ రాత్రి భోజనానంతరం—

పందిరి (లేని) మంచంమీద శయనించిన సమయంలో—

"ఈ ఫొటోలో వున్నది ఎవరో చెప్పగలవా?" అన్నాడు రాజు, చేతిలో వున్న సినిమా పత్రిక లోని ఓ ఫొటోని వేలితో చూపిస్తూ

కాసేపు పరిశీలించి, "తెలియదు" అంది స్వరాజ్యం.

"వ్వాట్? ఇంత గొప్ప వ్యక్తి గురించి తెలియనివారుండరు. గుర్తుతెచ్చుకో! నువ్వు ఈయన గురించి ఎక్కడో అక్కడ చదివే వుంటావు కనీసం ఫొటో అయినా చూసి వుంటావు" అన్నాడు రాజు మరో ఛాన్సు గ్రాంటు చేస్తూ.

మళ్ళీ నిశితంగా పరీక్షించి—

"మా బాబాయి కాదుగానీ, ఆయన పోలిక లున్నాయి" అంది ఆమె ఈసారి జవాబు చెప్ప గలిగినందుకు ఆమె మొహంలో రిలీఫ్.

"ఓ! నాన్సెన్సు నీకు మీ బాబాయి తప్ప ప్రపంచంలో ఎవరూ తెలియరు?"

"........."

"అయితే నేను చెబుతాను విను. ఈయన పేరు సత్యజిత్‌రాయ్ గొప్ప బెంగాలీ ఫిలిం డైరెక్టరు" అన్నాడు రాజు శిష్యుడి అజ్ఞానం పోగొట్టే ఋషిలా.

"సత్యజిత్‌రాయ్ అంటే రాజారామ మోహన్ రాయ్ తమ్ముడా" అంది స్వరాజ్యం క్యూరి యస్‌గా.

తను స్కూలులో చదివేటప్పుడు చరిత్రపుస్తకంలో రా జా రా మ మో హ న్ రా య్ గురించి కంఠస్థం చేసింది.

"ఓ! ఎగైన్ నాన్సెన్సు. ఇక మధ్యలో నువ్వేమీ మాట్లాడకు. నేను చెప్తాను" అంటూ సత్యజిత్‌రాయ్ గురించి గంటసేపు ఎక్స్‌ప్లెయిన్ చేశాడు.

ఆమెకు కొంత అర్థమయింది కొంత కాలేదు. అంతా విన్న తరువాత "మనం తెలుగు వాళ్ళం కదా. బెంగాలీ ఫిలిం డైరెక్టరుగురించి మనకెందుకు" అన్న ధర్మసందేహం వెలిబుచ్చింది.

సాధనమున పనులు నమకూరు ధరలోన అన్న సూక్తి గుర్తు తెచ్చుకున్నాడు రాజు.

అంతే! వారం రోజులు కష్టపడ్డాడు.

ఇప్పుడు స్వరాజ్యానికి సత్యజిత్‌రాయ్‌గురించి తెలియని అంశం లేదు ఆయన నడి బజారులో నడిచి వెళ్తుంటే అతన్ని ఇట్టే గుర్తుంచి కర చాలనం చెయ్యాలన్నంత అభిమానం అతనిపై పెంచుకుకుంది.

* * *

ఆరోజు ఆదివారం. రాజు తీరిగ్గా కాఫీ తాగుతూ పేపరు తిరగేస్తున్నాడు. స్వరాజ్యం వంటపనిలో వుంది.

ఇంతలో—

"రాజ్యం! క్విక్! నువ్వు టెన్‌మినిట్స్‌లో రడీ అయిపోవాలి" అన్నాడు రాజు తలా తోకా లేకుండా.

"లిబర్టీలో 'గన్‌ఫైటర్స్' రన్ అవుతూంది. ఇవాళే లాస్ట్ డే" అంటూ మరో మాటకి తావు లేకుండా తాను డ్రస్ చేసుకోవటం మొదలు పెట్టాడు.

"వంట సగంలో వుంది ఎలా?" అంది ఆమె.

"లీవ్ దట్ బ్లడీ కిచెన్. కమాన్ క్విక్" అంటూ తొందర చేశాడు

అరగంటలో థియేటరు చేరుకున్నారు. మరో పది నిముషాలు తరువాత టిక్కెట్లు తీసుకుని లోపలికి వెళ్లారు.

సినిమా అయిపోయింది. ఆటోలో తిన్నగా అన్నపూర్ణ హోటలుకి చేరుకున్నారు.

లోపల చల్లగా ఉంది. అంతకంటే ఎక్కువగా చీకటిగా ఉంది.

"ఏమిటి ఇలా వుంది" అంది స్వరాజ్యం.

"ఎయిర్ కండిషన్డ్ కదా" అన్నాడు రాజు.

భోజనం చేస్తూ వుండగా "పిక్చరు ఎలా వుంది" అన్నాడు.

"ఒక్కముక్క అర్థం గాలేదు అర్థంకాని సినిమా అర్ధరహితంగా వుంటుంది" అంది సూటిగా.

"కొత్తలో అలాగే వుంటుంది. రెగ్యులర్‌గా ఇంగ్లీషు సినిమాలు చూస్తే కొన్నాళ్ల తరువాత మరో లాంగ్వేజి పిక్చరు చూడబుద్ధి కాదు"

* * *

కృషితో నాస్తి దుర్భిక్షం అన్నారు



## నాయకుడు


"పొట్ట చింపితే అక్షరం ముక్క రాదు నోరు విప్పి మాట్లాడలేవు నాయకుడి వయ్యావట. దేనికి?" అడిగాడు అన్నారావు, చిన్నారావుని.

"అఖిలభారత మూగవాళ్ళ సంఘానికి" సైగచేసి చెప్పాడు చిన్నారావు

—డా. జి. సింగరాజు (విశాఖపట్నం)

(పోటీలో సాధారణప్రచురణకు స్వీకరించినజోకు)

ప్రయాణం —రాగతిపండరి





### అడిగి....

"స్త్రీలకు ఆస్తిలో సమానవాటా ఇప్పిస్తాం అంది కదా మీ పార్టీ. ఆస్తితోపాటు అప్పుల్లో కూడా వాటాఇస్తారా?" అడిగాడు విలేకరి. మంత్రిని.

"ఈ విషయం ముఖ్యమంత్రిగారి నడిగి చెప్పాలండి..." అన్నాడా మంత్రి.

—డా. సత్యప్రసాద్ (భీమవరం)

(పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించినజోకు)

రాజు తన కృషి ఫలితంగా అనతికాలంలోనే స్వరాజ్యాన్ని ఓ మోడరన్‌లేడీగా తయారు చేయ గలిగారు.

ఆమె చదువులో ఎనిమిదవ క్లాసు దాటక పోయినా ఎనిమిదవ వింత (ఎయిత్ వండర్)గా తయారు అయింది.

ఇప్పుడు స్వరాజ్యం రాజు కలలుగన్న—

అభ్యుదయ స్త్రీ.

మోడరన్ లేడీ, మరియూ

ఓ ఫెయిర్ లేడీ.

* * *

కాలం ముందుకి సాగిపోతూంది.

రాజుకి రెండు ప్రమోషన్లు వచ్చాయి.

స్వరాజ్యానికి ఇద్దరు పుల్లలు పుట్టారు.

రాజుకి ప్రమోషను స్టాగ్నేషనకు వచ్చింది.

స్వరాజ్యం ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషను చేయించుకుంది.

రాజుకి ఆఫీసులో పని బరువు పెరిగింది.

స్వరాజ్యానికి ఇంట్లో పిల్లల బాధ్యత హెచ్చింది.

రాజుకి ఇప్పుడు ఆదాయం సరిపోవటం లేదు.

స్వరాజ్యానికి ఇంటిపనితో తెమలటం లేదు.

* * *

యాన్యువల్ ఎక్కౌంట్సు జరుగుతున్నాయి ఆ రోజు రాత్రి పది తరువాత ఇంటికి వచ్చాడు రాజు,

"స్నానానికి వేడినీళ్ళు పెట్టలేదా?" అన్నాడు రాజు.

"మీరు గీజర్ కొనమంటే కొనరు. ఆ వెధవ బోయిలరు ఒక పట్టాన వెలిగి చావదు ఈ రోజుకి ఎలాగో చన్నీళ్ళు పోసుకోండి" అంది స్వరాజ్యం

చన్నీళ్ళు వద్దని శరీరం ఎదురు తిరిగింది.

రాజు మనసులో అసంతృప్తి

* * *

"రేపు ఉదయం త్వరగా ఆఫీసుకెళ్ళాలి ఇన్‌స్పెక్షన్ వుంది. ఏడున్నరకే బ్రేక్‌ఫాస్ట్ చేసి వెళ్ళాను" అన్నాడు రాజు మరో రోజున.

"గ్రైండరు చెడిపోయింది. పిండి రుబ్బటం నా వల్లకాదు. ఏ హోటలులోనయినా తినండి" అంది ఆమె

"మా బ్యాంకు దగ్గర ఓ ఇరానీ హోటలు తప్ప మరొకటి లేదు. అందులో ఏం దొరుకుతుంది బ్రెడ్‌తప్ప"

"అబ్బ ఒక్కరోజుకి ఎడ్జస్టు కాలేరా?"

"కడుపులో కాలుతుంటే ఆఫీసులో పని మీద ఎలా ఏకాగ్రత ఏర్పడుతుంది" తనలో తాను గొణుక్కున్నాడు రాజు

* * *

సాయంత్రం ఆఫీసునుంచి వచ్చిన రాజుకి పిల్లలు ఇద్దరూ మెట్లమీద కూర్చుని కనబడ్డారు ఇంటికి తాళంవేసి ఉంది.

"అమ్మ ఎక్కడికి వెళ్ళిందిరా" అన్నాడు రాజు కొడుకుతో.

"పక్కింటి పిన్నిగారితో అమ్మ లిబర్టీలో 'గన్‌ఫైటర్స్' సినిమాకెళ్ళిందట. ఆ పిక్చరు ఇవాళ లాస్ట్‌డేట. అలా అని పిన్నిగారబ్బాయి నాతో అన్నాడు"

రాజు తనవద్దగల డూప్లికేట్ కీతో తలుపులు తెరిచి పిల్లలను లోపలికి తీసుకువెళ్ళాడు

"నాన్నా" ఆకలి అంటూంటే ఇంత వండి పిల్లలకు పెట్టాడు.

పిల్లల తిండితిప్పలు చూడకుండా అలా సినిమాకి వెళ్ళకపోతే ఏమో అని మనసులో అనుకున్నాడు.

* * *

మరో రోజున—

"ఆ సినిమా పత్రిక తరువాత చూడవచ్చు నాకు భోజనం వడ్డించరాదూ ఆకలవుతూంది" అన్నాడు రాజు

"అన్నీ టేబులుమీద సర్ది వున్నాయి కదా" అంద స్వరాజ్యం సినిమా పత్రికలోంచి తల పైకెత్తకుండానే.

తను స్వయంగా వడ్డిస్తూ భర్త భోజనం విషయంలో శ్రద్ధ వహించటం స్వరాజ్యం ఏనాడో మానుకుంది.

"అబ్బ! వెధవపత్రిక మూసేద్దూ వచ్చి భోజనం వడ్డించు" అన్నాడు మళ్లీ రాజు సౌమ్యంగానే.

"వెధవ పత్రిక అంటే ఏమిటి మీ ఉద్దేశ్యం. మీరు బయట అన్ని సరదాలూ తీర్చుకుని రావచ్చు. కానీ ఇంటిపనిలో అలసిపోయి నేను కాస్త రిలీఫ్‌కోసం సినిమాపత్రిక చూడటంతప్పా"

"తప్పని అనటంలేదు కానీ ముందు ఇల్లు పిల్లలు ఆ తరువాత ఏదయినా. మొన్నటికి మొన్న పిల్లలకు తిండిపెట్టకుండా సినిమాకు వెళ్ళావు ఇవాళ ధోరణి ఇలా వుంది"

రాజు సహనం కోల్పోసాగాడు.

"ఎంతసేపూ మీకు మీ పిల్లలకు సేవ చేయటానికి నేను మీ ఇంటిబానిసను కాదు పనిమనిషిని అంతకంటే కాదు. సైన్సు ఇంత డెవలప్ అయి, మానవుడు అంతరిక్షంలో పయనిస్తున్న ఈ యుగంలో కూడా, భార్యని తమతో సమానంగా చూడలేని మీలాంటి భర్తలున్నంత వరకు ఈ సమాజం బాగుపడదు. స్త్రీ జాతికి విముక్తి లేదు" అంటూ ఎంతో కోపంగా అవతలి గదిలోకి వెళ్ళిపోయింది.

రాజుకి భోజనం చేయాలనే మూడ్ పాడు అయిపోయింది.

ఆకలి చచ్చిపోయింది.

స్వరాజ్యం ఇలా ఎందుకు తననిసాధిస్తుందో ఎంత ఆలోచించినా రాజుకి అంతుబట్టలేదు. ✻

కుంభకోణం —లేపాక్షి

